RNI NO. APTEL/2014/58326
నవతరం
తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 75 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
08-01-2026 గురువారం వెల : 1/- పేజీలు : 4

# పలాసలో అక్రమ గ్రావెల్ దందాపై ఎమ్మెల్యే గౌతు శిరీష ఉక్కుపాదం



- ఇకపై ఉపేక్ష లేదు... అక్రమ తవ్వకాలపై జీరో టాలరెన్స్
- అధికారులకు పూర్తి స్వేచ్ఛ -నా పేరు చెప్పినా వదలొద్దు
- పలాస నియోజకవర్గంలో చట్టబద్ధమైన గ్రావెల్ క్వారీలు లేవు
- అభివృద్ధి పనులకు ఉచిత పర్మిట్లకు అవకాశం
- ఏపీఎండీసీ ద్వారా రెండు పెద్ద క్వారీలు ప్రతిపాదన
- జగన్నాథ సాగరం ఆక్రమణలపై క్రిమినల్ చర్యలు



**నవతరం, పలాస**

పలాస నియోజకవర్గంలో కొండలను కొల్లగొడుతూ, ప్రభుత్వ ఆస్తులను దోచుకుంటున్న అక్రమ గ్రావెల్ మాఫియాపై స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష తీవ్రంగా విరుచుకుపడ్డారు. "గతంలో జరిగినవి ఒక లెక్క, ఈ రోజు నుంచి మరో లెక్క. అక్రమంగా ఎవరు తవ్వకాలు జరిపినా, వారి వెనుక ఎవరున్నా ఉపేక్షించేది లేదు" అంటూ కఠిన హెచ్చరిక జారీ చేశారు. ఈ మేరకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్, రవాణా శాఖల అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ, అక్రమ గ్రావెల్ తరలింపుపై ఇకపై రాజకీయ ఒత్తిడి ఉండదని, అక్రమంగా వాహనాలు తరలిస్తే తక్షణమే సీజ్ చేసి, భారీ ఫైన్లు విధించి, అవసరమైతే లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. "ఈ విషయంలో ఎవరు తలదూర్చినా, చివరకు నా పేరు చెప్పినా వదలవద్దు. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాను" అని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో వీఆర్వోలకు తెలియకుండా ఉండదని, ఎక్కడైనా అక్రమం జరిగితే సంబంధిత అధికారిదే పూర్తి బాధ్యత అని ఆమె తేల్చిచెప్పారు. సమావేశంలో పాల్గొన్న మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. విజయలక్ష్మి మాట్లాడుతూ, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో కలిపి మొత్తం 21 లీజులు ఉన్నప్పటికీ, పర్యావరణ అనుమతులు, రెవెన్యూ బకాయిల కారణంగా అవి పనిచేయడం లేదని తెలిపారు. ప్రస్తుతం పలాస నియోజకవర్గంలో అధికారికంగా పనిచేస్తున్న గ్రావెల్ క్వారీ ఒక్కటి కూడా లేదని ఆమె స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు, ప్రభుత్వ అవసరాల కోసం గ్రావెల్ కావాలంటే సంబంధిత శాఖలు ఉచిత పర్మిట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వాణిజ్య అవసరాల కోసం లేదా ప్రైవేట్ వ్యక్తులు గ్రావెల్ క్వారీలు నిర్వహించాలంటే మైనింగ్ శాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేయాలని సూచించారు.

దీర్ఘకాలిక పరిష్కారంగా, ఏపీఎండీసీ ద్వారా వజ్రపుకొత్తూరు మండలంలో రెండు పెద్ద క్వారీలను ప్రతిపాదించామని, అవి అందుబాటులోకి వస్తే సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందని వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో కొండలు కరిగిపోయినప్పుడు మౌనం వహించిన ప్రతిపక్షలు, ఇప్పుడు కొండల రక్షణ పేరుతో మాట్లాడటం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. అలాగే, అక్రమ తవ్వకాలపై వార్తలు రాస్తున్న మీడియా, అక్రమంగా తవ్వకాలు చేస్తున్న వ్యక్తుల పేర్లను కూడా ప్రచురిస్తే చర్యలు తీసుకోవడం మరింత సులభమవుతుందని కోరారు. ఈ సమావేశంలో జగన్నాథ సాగరం చెరువు ఆక్రమణల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇప్పటికే 31 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని రెవెన్యూ అధికారులు నివేదిక ఇచ్చారని, ఈ విషయంలో ఎంతటివారైనా సరే క్రిమినల్ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో పాల్గొన్న జేసీబీ, ట్రాన్స్‌పోర్ట్ యజమానులు చట్టబద్ధంగా వ్యాపారం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే అనుమతుల ప్రక్రియను సింగిల్ విండో విధానంలో సులభతరం చేయాలని కోరారు. మొత్తం మీద, పలాసలో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోందన్న సంకేతాన్ని ఈ సమావేశం స్పష్టంగా ఇచ్చింది.

# గంజాయి అక్రమ రవాణా కేసులో నలుగురి అరెస్ట్



- 3.700 కిలోల గంజాయి స్వాధీనం.
- కాశీబుగ్గ డీఎస్పీ షేక్ సహబాజ్ అహ్మద్

**(నవతరం-పలాస)**

పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన సాహు ఆనంద్, సీఐసీఎల్ వడ్డీ లోకనాథం, అలాగే పలాస మండలం నీలిబద్ర గ్రామానికి చెందిన అన్నదమ్ములు బెహరా రమేష్ మరియు సీఐసీఎల్ 2 బెహరా కామేష్ ఒకే ప్రాంతానికి చెందిన ఇరుగు పొరుగు గ్రామస్థులు. వీరందరూ గతంలో బ్రాహ్మణతర్లా హై స్కూల్‌లో కలిసి చదువుకున్నారు.

ఈ క్రమంలో పరస్పరం స్నేహం పెంచుకుని, పలుమార్లు నలుగురూ కలిసి మద్యం, సిగరెట్లు సేవించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సుమారు ఒక సంవత్సరం కిందట ఒడిశా రాష్ట్రం, బరంపూర్‌కు చెందిన ఏ-3 పప్పు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడినట్లు తెలిసింది. ఆ పరిచయంతో అతని వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి, బరంపూర్ నుంచి పలాసకు తీసుకువచ్చి, పలాస పరిసర ప్రాంతాల్లో అవసరమైన వారికి చిన్నచిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ నెల 6న సాయంత్రం నాలుగు గంటల సమయంలో గంజాయిని విక్రయించేందుకు ఒక గోనె సంచిలో తీసుకుని నలుగురూ బ్రాహ్మణతర్లా గ్రామం నుంచి కంబ్రిగాం బ్రిడ్జి వైపు నడుచుకుంటూ వస్తుండగా, పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించి వారిని పట్టుకున్నారు.

వారినుంచి మొత్తం 3.700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, నలుగురుని అరెస్టు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని కాశీబుగ్గ డీఎస్పీ తెలిపారు.

# అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కూటమి ప్రభుత్వం

- దొంగచాటు రాజకీయం వైకాపాది!
- పని చేసింది కూటమి ప్రభుత్వం
- ఫలితం పొందుతున్నది చీపురుపల్లి ప్రజలు!
- చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు

**నవతరం -చీపురుపల్లి**

నేడు చీపురుపల్లి నియోజకవర్గ ప్రజల ఏడేళ్ల నిరీక్షణకు తెరపడింది. ఎప్పుడో పూర్తి కావాల్సిన =ాదీ బ్రిడ్జిని గత వైకాపా ప్రభుత్వం తన నిర్లక్ష్యం వల్ల, బిల్లులు చెల్లించకపోవడం వల్ల గాలికొదిలేసింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి, ఈనెల 10వ తేదీన ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం.

రెండు రాష్ట్రాల వారధి..

ఈ బ్రిడ్జి కేవలం చీపురుపల్లికి మాత్రమే కాదు, అటు ఒడిశా నుంచి ఇటు విశాఖపట్నం వరకు వెళ్లే రెండు రాష్ట్రాల ప్రజలకు అత్యంత కీలకం. గత ప్రభుత్వం ఐదేళ్లు నిద్రపోవడం వల్ల ఈ రోడ్డు కట్ అయిపోయి ప్రజలు నరకం చూశారు.

చంద్రబాబు గారి విజన్..

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమే సైకో జగన్ పాలనను ప్రజలు చిత్తుగా ఓడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు, మరియు కేంద్రంలోని మోదీ గారి సహకారంతోనే ఈ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయగలిగాం.


పనులు మేము పూర్తి చేస్తుంటే, వైకాపా నేతలు దొంగచాటుగా వచ్చి కొబ్బరికాయలు కొట్టడం, సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ హడావిడి చేయడం సిగ్గుచేటు. ఏడేళ్ల పాటు ఈ ప్రాజెక్టును అడ్డుకున్నది మీరు కాదా? ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని ఫోటోలకు పోజులిస్తున్నారు?





# అప్రమత్తత, సమన్వయంతో రథసప్తమి బందోబస్తు

## జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, ఐపీఎస్



**నవతరం -శ్రీకాకుళం**

రథసప్తమి వేడుకలను పటిష్ట బందోబస్తుతో నిర్వహించేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ శ్రీ కే.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారు అన్నారు. పోలీసు అధికారులు, ఆలయ అధికారులు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

ప్రసిద్ధ అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల


-మిగతా 2లో

ఎడిటోరియల్

# అమెరికా అహంకారం

అమెరికా ప్రజాస్వామ్యం, మానవహక్కుల గురించి భ్రమల్లో ఉన్నవారికి డోనాల్డ్ ట్రంప్ దుర్మార్గ చర్య కనువిప్పు కలిగిందని భావించవచ్చా? వెనెజులా మీద దాడి చేసి నిద్రమంచం మీద ఉన్న అధ్యక్షుడు నికోలస్ మదురో, సతీమణి సిలియా ఫ్లోర్స్‌ను బంధించి అమెరికా తీసుకువెళ్లి తమ చట్టాల ప్రకారం విచారణ జరుపుతామం టున్నారు. ఈ తీరును సమర్ధించేవారు, జరిగిన దుర్మార్గాన్ని చూసి కూడా మౌనముద్ర దాల్చిన అపర ప్రజాస్వామికవాదుల తీరు ఆందోళన కలిగిస్తున్నది. కొన్ని సమయాల్లో కొందరు మనుషులు అన్నట్లుగా పరీక్ష సమయంలో అసలు రంగు బయట పడుతుంది.
ప్రజాస్వామ్యాన్ని ఏడు నిలువుల లోతున పాతిపెట్టిన ట్రంప్ దుర్మార్గాన్ని ఖండించటానికి ప్రజాస్వామ్య పుట్టినిల్లు అని చెప్పుకున్న వారికి నోటమాట రాకపోవటం చూసిన తర్వాత సామాన్యుల గురించి చెప్పేదేముంది. ఎవరికైనా తమదాకా వస్తేగాని తత్వం బోధపడదని మన పెద్దలు ఊరికే చెప్పలేదు. మనల్ని కాదు గదా అనుకుంటే మనదాకా వచ్చిన తర్వాత అయ్యో పాపం అనే వారు ఉండరు. భద్రతా మండలి అమెరికా దుశ్చర్యను చర్చిస్తున్నది, అయితే అదేదో చేస్తుందని ఎవరూ భ్రమలు పెట్టుకోనవసరం లేదు. అమెరికా చర్య వెనెజులాతోనే ఆగదు, యావత్ మానవాళికి అది ముప్పుగా మారుతోంది.
ఒక సర్వసత్తాక దేశం మీద దాడిచేసే అధికారం అమెరికాకు ఎవరిచ్చారు? మాదక ద్రవ్యాలను తయారు చేసి అమెరికాకు రవాణా చేస్తున్న ముఠాకు మదురో నాయకుడని గత కొంతకాలంగా తప్పుడు ప్రచారం చేస్తున్నపుడే ఏదో దుర్మార్గానికి అమెరికా పాల్పడుతుందని కొందరు భావించారు. ఆంక్షలు ప్రకటించటంతో క్యూబా మాదిరి దిగ్బంధనానికి పూనుకుంటారేమో అనుకున్నారు గానీ కిడ్నాప్‌నకు పాల్పడతారని మదురో ఊహించి ఉంటే కథవేరుగా ఉండేది. మదురో మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నాడనేది పచ్చి అబద్ధం. అసలు అమెరికాకు మాదకద్రవ్యాల సరఫరా కొన్ని దశాబ్దాల నుంచి జరుగుతోంది. నికరాగువాలో వామపక్ష శాండినిస్టాలను గద్దె దించేందుకు కాంట్రాకు సిఐఏ స్వయంగా మాదకద్రవ్యాలతో వచ్చిన సొమ్మును అందచేసిన చరిత్రదాస్తే దాగేది కాదు. పన్నేండ్ల పైబడిన అమెరికన్లలో 51శాతం మంది ఎప్పుడో ఒకసారి అక్రమంగా దొరికే మాదకద్రవ్యాలను తీసుకున్నవారే అని సర్వేలో తేలింది. వారందరికీ వెనెజులా నుంచి సరఫరా చేస్తున్నారా? ఎన్నడైనా వాటి నిరోధం పేరుతో ఎవరిమీదనైనా అమెరికా దాడి చేసిందా? ఒక కుక్కను చంపదలచుకొంటే పిచ్చిదని ప్రచారం చేయాలన్న దుర్మార్గ ఎత్తుగడ తెలిసిందే. మన కళ్ల ముందు పాలస్తీనా విముక్తి కోసం పోరాడిన నేత యాసర్ అరాఫత్‌ను అమెరికా ఉగ్రవాదిగా, పిఎల్‌ఓను ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రచారం చేసింది. ఇరాక్‌లో బాత్‌పార్టీ నేత, అధ్యక్షుడు సద్దామ్ హుస్సేన్ మారణాయుధాలను గుట్టలుగా పోసి పశ్చిమాసియాకు ముప్పుతెచ్చాడని ప్రచారం చేసింది. చివరికి ఇరాక్‌ను ఆక్రమించి సద్దామ్‌ను ఉరితీసిన దుర్మార్గం తెలిసిందే. తర్వాత అదే అమెరికా అక్కడ ఎలాంటి మారణాయుధాలు లేవనీ ప్రకటించింది. లిబియాలో గడాఫీని చం పించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్లను తయారు చేసి తిరుగుబాటు చేయించింది. సోవియట్ ఉపసంహరించుకున్న ఆ దేశాన్ని ఏకంగా ఆక్రమించుకొనేందుకు పూనుకుంటే ఆ తాలిబాన్లే అడ్డం తిరగాల్సి వచ్చింది.
రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు హిట్లర్ ఏదో ఒకసాకుతో ఐరోపా దేశాల ఆక్రమణకు పూనుకున్న దుర్మార్గాన్ని ఇప్పుడు ట్రంప్ తలపింపచేస్తున్నాడు. వెనెజులాలో కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు తామే పరిపాలన చేస్తామని, చమురు సంపదలను వెలికితీస్తామని బరితెగించి మాట్లాడుతున్నాడు. అంతేకాదు, మెక్సికో, కొలంబియా, క్యూబాల సంగతి కూడా చూస్తామని ప్రకటించాడు. అమెరికా ఎందుకిలా తెగిస్తున్నది ? లాటిన్ అమెరికాను తన పెరటితోటగా, అవసరాలను తీర్చే దేశాలుగా చూస్తున్న తరుణంలో అక్కడి వామపక్ష శక్తుల ఆవిర్భావం, అధికారానికి రావటంతో అమెరికన్ల రంగుల కలచెదిరింది. వెనెజులాలో ఛావెజ్ అధికారానికి రావటమేగాక అప్పటివరకు అక్కడి చమురు సంపదలను కాజేస్తున్న అమెరికా కంపెనీలను జాతీయం చేశాడు, మదురో ఆ విధానాన్ని కొనసాగిస్తున్నాడు.
అంతేకాదు, క్యూబా ఇతర దేశాలకు చమురు సరఫరా చేయటం శ్వేతసౌధంలో ఎవరున్నప్పటికీ మింగుడుపడటం లేదు. వెనెజులా సోషలిస్టులను గద్దె దించేందుకు మితవాద శక్తులకు డాలర్లు ఇచ్చి రంగంలోకి దించినా ఛావెజ్, మదురో వమ్ము చేశారు. ఇక లాభం లేదని బరితెగించి మదురోను కిడ్నాప్ చేయించాడు. ఈ దుర్మార్గాన్ని చైనా, రష్యా, కొలంబియా, బ్రెజిల్ వంటి దేశాలు ఖండించాయి. ప్రపంచ ప్రజాస్వామ్యానికి తల్లివంటిది భారత్ అని చెబుతున్న నరేంద్రమోడీ సర్కార్ ట్రంప్ దుర్మార్గాన్ని ఖండించలేదు. ఇది తటస్తంగా ఉండాల్సిన తరుణమా అంటే కానే కాదు. యావత్ సామ్రాజ్యవాదవాద వ్యతిరేకశక్తులు గళమెత్తాలి, అమెరికా దుర్మార్గాన్ని అడుగడుగునా ఎండగట్టాలి.

# శక్తి టీమ్ అవగాహనా కార్యక్రమం



**నవతరం,పాలకొండ**

మహిళలు, బాల, బాలికల రక్షణ రూపొందించబడిన శక్తి యాప్ ఉపయోగాలపై అవగాహన కార్యక్రమాన్ని పాలకొండ శక్తి టీమ్ ఆధ్వర్యంలో స్థానిక పెద్దకాపువీధి హై స్కూల్, ఎంపీపీ స్కూల్‌తోపాటు పాలకొండ సిరి స్కూల్‌లో బుధవారం నిర్వహించారు.
ఈ సందర్భంగా మహిళా ఏఎస్ఐ ఝాన్సీబాయి మాట్లాడుతూ, మహిళలు, బాలికల రక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ఆపదలోనున్న సమయంలో 112 నెంబర్ కు కాల్ చేసి తక్షణ సహాయం పొందాలని సూచించారు. సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల పై అవగాహన కల్పించారు. విద్యార్థులందరూ మంచి, చెడులను గుర్తించి, తల్లిదండ్రులను, పెద్దలు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ, మంచి నడవడికతో బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని ఆకాక్షించారు. బాల, బాలికల రక్షణకు 1098 సైబర్ క్రైమ్‌కు 1930, మహిళల రక్షణకు 181, డ్రగ్ టోల్ ఫ్రీ నెంబర్ 1972ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు , మహిళా ఏఎస్ఐ జి.ఝాన్సీభాయ్ , మహిళ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్.ప్రకృతాంబ, కానిస్టేబుల్స్ ఎ.రాము, గిరి ప్రసాద్, శోభారాణి పాల్గొన్నారు.

# అప్రమత్తత,సమన్వయంతో రథసప్తమి బందోబస్తు

**మొదటిపేజీ తరువాయి**

19 నుండి 25వ తేదీ వరకు జరగనున్న రథసప్తమి వేడుకలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతియుతంగా, సురక్షతంగా వేడుకలు నిర్వహించేందుకు చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో రథసప్తమి రోజున ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున ట్రాఫిక్ నియంత్రణ, హెలిప్యాడ్ భద్రత, పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ మరియు బారికేడ్ల నిర్వహణ, సూచిక బోర్డుల ఏర్పాటు, భద్రతా చర్యలు, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు, అత్యవసర సేవల సమన్వయం తదితర అంశాలపై జిల్లా ఎస్పీ విస్తృతంగా చర్చించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రథసప్తమి వేడుకల్లో పోలీసు అధికారులకు అప్పగించిన కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో సీసీటీవీ మెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, డ్రోన్ మెరాల సహాయంతో జనసందోహాన్ని పర్యవేక్షంచాలని తెలిపారు. భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే ప్రాంతాలు, ఇతర కీలక ప్రదేశాల్లో పోలీసు సిబ్బందిని అధికంగా వినియోగించాలని ఆదేశించారు. అదేవిధంగా ఎలాంటి లోపాలు లేకుండా, భక్తులకు అసౌకర్యం కలగకుండా వేడుకలను నిర్వహించేందుకు గట్టి నిఘా కొనసాగించాలని, బారికేడ్ల ఏర్పాటు మరియు క్యూలైన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. రూ.100/- దర్శనం మరియు ఉచిత దర్శనం క్యూలైన్లలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. తాగునీరు, వైద్య శిబిరాలు, అగ్నిమాపక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. హెలిప్యాడ్ భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశాలు చేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కే.వి. రమణ, పి. శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, శ్రీకాకుళం సబ్ డివిజన్ పోలీసు ఇన్స్పెక్టర్లు, ఎస్సై లు వీ.ఆర్. పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# 9న సిక్కోలు రథసప్తమి కర్టెన్ రైజర్

## ఏర్పాట్లను పరిశీలించిన కమిటీ సభ్యులు



**నవతరం, శ్రీకాకుళం**

అరసవల్లి క్షత్రంలో ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న రథసప్తమి వేడుకల అంకురార్పణ (కర్టెన్ రైజర్) కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. జనవరి 19న ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న ఈ వేడుక ఏర్పాట్లను బుధవారం ఉదయం ప్రత్యేక కమిటీ సభ్యులు క్షత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో దాదాపు 200 మందితో సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించేందుకు అనువైన వేదికను సిద్ధం చేయాలని, భక్తుల సౌకర్యార్థం భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బందోబస్తు, లైవ్ కవరేజీ తదితర అంశాలపై అధికారులతో చర్చించి దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర పండుగగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో విద్యుత్, మున్సిపల్, ఆరోగ్య శాఖల సమన్వయం ఎంతో అవసరమని, ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా ఆయుష్ వైద్యాధికారి జగదీష్, సోషల్ వెల్ఫేర్ డిడి మధుసూదనరావు, డీఐపీఆర్వో చెన్నకేశవరావు, యోగా గురువు పాండ్రంకి మురళి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొంక్యాన మురళీధర్, మంత్రి వెంకటస్వామి, ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతను మెరుగుపరిచేలా చర్యలు

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




**నవతరం, శ్రీకాకుళం**

స్థానిక జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా ప్రజా రవాణా సంస్థ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతను పాటిస్తూ మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేటట్లు చూడాలని అధికారులు ఆదేశించారు.
ఈ సమావేశంలో ఆర్టీసీ డ్రైవర్ మరియు కండక్టర్ యొక్క ప్రవర్తన, బస్ స్టేషన్ పరిసరాలలో పరిశుభ్రత సీటింగ్ మరియు వెయిటింగ్ ప్రాంతాలు నిర్వహణ, త్రాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ సౌకర్యం మరియు నిర్వహణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంస్థ సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని, ఆర్టీసీ పరిసరాల్లో గల టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలని, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరం ఉన్నచోట అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లకు వెళ్లే దారిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఔట్సోర్సింగ్ సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రయాణికులకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులతో అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లకు శిక్షణ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. స్త్రీ శక్తి అమలలో భాగంగా మహిళలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. ఇచ్చాపురం బస్ స్టేషన్ కి సంబంధించి త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. రోడ్ సేఫ్టీ, పి.జి.ఆర్.ఎస్. కంప్లైంట్స్ తదితర అంశాల గురించి అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా ట్రాన్స్పోర్ట్ అధికారి, సి.హెచ్. అప్పలనారాయణ, శ్రీకాకుళం డిపో మేనేజర్లు ఎం అమర సింహుడు మరియు శర్మ, టెక్కలి డిపో మేనేజర్, శ్రీనివాస్, పలాస డిపో మేనేజర్ నాయుడు, అసిస్టెంట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత హోంగార్డుకు ఆర్థిక చేయూత



**నవతరం, శ్రీకాకుళం**

ఇటీవల పదవీ విరమణ పొందిన విశ్రాంత హోంగార్డు పి. సన్యాశిరావుకు సహచర హోంగార్డులు ఆప్యాయతతో ఆర్థిక చేయూతనందించారు. ఈ సందర్భంగా హోంగార్డు సిబ్బంది స్వతహాగా ముందుకు వచ్చి తమ ఒక్కరోజు గౌరవ వేతనం సమకూర్చి మొత్తం రూ.4.11 లక్షల నగదు చెక్కును సేకరించారు. ఈ చెక్కును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కేవీ.మహేశ్వర్‌రెడ్డి విశ్రాంత హోంగార్డు సన్యాశిరావుకు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సహచర హోంగార్డులు చూపిన ఈ సహకారం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. పోలీసు శాఖ ఒక కుటుంబంవంటిదని, కష్టసమయాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే పోలీసు వ్యవస్థ గొప్పతనమని తెలిపారు. ఇటువంటి సంఘీభావం పోలీసు సిబ్బందిలో ఐకమత్య భావాన్ని మరింత బలపరుస్తుందన్నారు. అలాగే ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవితాన్ని గడపాలని విశ్రాంత హోంగార్డు సన్యాశిరావుకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

# కాలం కథ చెప్పిన శాస్త్రవేత్త

(జనవరి 8- స్టీఫెన్ హాకింగ్ జయంతి)

లోపాలను కూడా విజయ సోపానులుగా మార్చుకోగల సామర్థ్యం కొంతమందికే ఉంటుంది. అటువంటి వారిలో ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్ర వేత్త స్టీఫెన్ హాకింగ్ ఒకరు. నాకు మోటార్ న్యూరాన్ వ్యాధి రాకపోతే నేనీస్థానంలో ఉండేవాడిని కాదని ఆయన పలుసార్లు వెల్లడించారు. 1942 జనవరి 8న ఆయన జన్మించారు.

విశ్వం ఎలా ఆరంభమయ్యింది? అది ఇప్పుడు ఉన్నట్లే ఎందుకు ఉంది? ఎలా ముగుస్తుంది? మనమంతా ఎక్కడ నుంచి వచ్చాం? లాంటి ఆలోచనలతో తలమునకలవుతూ పెరిగాడు. ఆయనికి 21 సంవత్సరాల వయసులో భయంకరమైన 'మోటార్ న్యూరాన్ డిసీజ్' వచ్చింది. వైద్యులు రెండేళ్లకు మించి బతకడని చెప్పేశారు. వ్యాధి ప్రభావం వల్ల క్రమేణా అతని శరీరమంతా చచ్చుబడిపోయింది. అదేమీ లెక్క చేయకుండా అతడు పట్టుదలతో చదువు మీద దృష్టి పెట్టాడు. కొన్నేళ్ల తర్వాత గొంతు కూడా మూగబోయింది. ఇంత కష్టంలో కూడా అర్హత గల వయసు కన్నా ఒక ఏడాది ముందే పీహెచ్‌డీ సాధించాడు.



యం.రాం ప్రదీప్

హాకింగ్ ఏనాడూ టెలిస్కోపులోకి తొంగి చూడలేదు. ఓ అధునాతన కంప్యూటర్ నియంత్రించే చక్రాల కుర్చీలోనే కూర్చుని ఎన్నో గ్రంథలను చదివాడు. తన మేధస్సు, ఊహా శక్తులతో 'బ్లాక్ హెూల్స్' (కృష్ణ బిలాలు)పై అధ్యయనం చేశారు. విశ్వసృష్టిశాస్త్రంలో ఆయన వెలువరించిన సిద్ధాంతాలు ఎందరో శాస్త్రవేత్తలకు మార్గదర్శకమయ్యాయి. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని, క్వాంటం సిద్ధాంతాన్ని సమన్వయపరిచి ఐక్యక్షత్రీయ సిద్ధాంతాన్ని వెలువరించే ప్రయత్నంలో ఎంతో కృషి చేశారు. ఆయన పేరు మీద బ్లాక్‌హెూల్స్ వెలువరించే కిరణాలను 'హాకింగ్ రేడియేషన్'గా గుర్తించారు.

1971నుంచి బిగ్ బ్యాంగ్ పై పరిశోధనలు మొదలు పెట్టిన ఆయన కృష్ణబిలాలకు సంబంధించి ఎన్నో విషయాలను ఆవిష్కరించాడు. 1984లో ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ పుస్తకరచన ప్రారంభించాడు. ఆ సమయంలోనే వ్యాధి వల్ల 1985లో వైద్యుల దగ్గర ఉండాల్సి వచ్చింది. అప్పుడే కంప్యూటరు సాయంతో మాట్లాడగలిగే పరికరాన్ని స్టీఫెన్ తయారు చేసుకున్నాడు. దాని సాయంతోనే 1988లో పుస్తకాన్ని వెలువరించాడు. అది అమ్మకాల్లో సృష్టించిన రికార్డు అంతా ఇంతా కాదు. ప్రపంచ వ్యాప్తంగా పలు భాషల్లో ఆ పుస్తకం వెలువడింది. తెలుగులోనూ కాలం కథ పేరుతో వెలువడింది.

ప్రపంచ వ్యాప్తంగా ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ అమ్మకాల్లో సృష్టించిన రికార్డు వల్ల అది 1998 అంటే వెలువడిన 10 సంవత్సరాల తరువాత గిన్నిస్ బుక్ లో స్థానం సంపాదించింది.

2014: హాకింగ్ జీవిత విశేషాలతో ది థియరీ ఆఫ్ ఎవ్వరిథింగ్ అనే సినిమా తీశారు. దీనికి ఆస్కార్ అవార్డు కూడా వచ్చింది. 2018 మార్చి 14న ఆయన తుదిశ్వాస విడిచారు.

హాకింగ్ఇలాచెప్పేవారు,"మరణం తర్వాత జీవితం లేదు. స్వర్గం ఓ కట్టుకథ. మరణం తర్వాత జీవితం, స్వర్గం, నరకం వంటివేమీ లేవు. ఇవన్నీ మృత్యువు అంటే భయపడేవారి కోసం అల్లిన కట్టుకథలు. మనిషి మెదడు కూడా కూడా కంప్యూటర్ వంటిదే. విడిభాగాలు పాడైన తర్వాత కంప్యూటర్ పనిచేయడం ఆగిపోయినట్లే మెదడు ఆగిపోతుంది. ఒక్కసారి మెదడు ఆగిపోయిన తరువాత ఏమీ మిగలదు. కన్నుమూసేలోపు మనకు ఉన్న శక్తిసామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగిస్తూ మంచి జీవితం గడపాలి. మనం చేసే పనులు అత్యున్నతంగా ఉండడానికి పాటుపడాలి. 49 ఏళ్లుగా మరణం నాకు అత్యంత సమీపంలో ఉంటోంది. అయినా కూడ నేను మృత్యువుకు భయపడడం లేదు. త్వరగా మరణించాలని అనుకోవడం లేదు. నేను కన్నుమూసే లోపుచేయాల్సిన పనులు చాలా ఉన్నాయి".

ఆయన చివరి రోజుల్లో మానవాళికి ఒక హెచ్చరిక జారీ చేశారు."పాలకులు త్వరగా మేల్కొని పర్యావరణ పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోకుండా ఉంటే,మరో వంద ఏళ్లలో ఈ భూమి మానవ నివాసానికి ఏ మాత్రం అనుకూలంగా ఉండదని, నివాసానికి మరో గ్రహాన్ని వెతుక్కోవాలని వివరించారు. హాకింగ్ మాటలని పాలకులు ఏ మేరకు అమలు చేయగలరనేది సందేహమే.

# ఓ సంస్కారమా...నీకో నమస్కారం..!



(నారీ స్వేచ్ఛకై గర్జించే ఓ గళం)

"మేం మాల్స్‌కి వస్తాం...
"మా అందాలు ఆరబోస్తాం...!"
"మేమింతే...అర్ధనగ్నంగా
"అశ్లీలంగా ఉంటాం
"మా ఒళ్ళు...
"మా ఇష్టం!" అంటే ఎలా..?
నారీ స్వేచ్ఛకై గర్జించే గళాలు
అభ్యర్థిస్తున్నాయి ఆ అర్థనగ్న
పాశ్చాత్య సంస్కృతి మనకొద్దని..!

"మా కళ్ళు మా ఇష్టం..అంటాడో పోకిరి...
"మా లాఠీ మా ఇష్టం...అంటాడో
పోలీసు
పోకిరోళ్లకు శిక్ష మురికి కాలువల శుభ్రతే
పోకిరితనానికి...పొగరుబోతుతనానికి...
అహానికి..అజ్ఞానానికి..అందాల
ఆరబోతకు..
ఇక చెక్ పెట్టాల్సిన సమయం
ఆసన్నమైంది..!

ఓ సంస్కారమా..!
నీకో నమస్కారం...
సిగ్గు, లజ్జా మాకేల...?
మేం వంటింటి కుందేల్లం కాదు
పిల్లల్ని కనే యంత్రాలం కాదు...
మేం పంజరాల్లో పక్షులం కాదు..
గదుల్లో తిరిగే గబ్బిలాలం కాదు..!

మేం వినువీధుల్లో
విహరించే విహంగాలం...
గాల్లో ఎగిరే గాలిపటాలం...
స్వేచ్ఛ...మా జన్మహక్కు..!

లోపం మాలో కాదు సృష్టిలో లేదు
కామాంధుడైన నరుని దృష్టిలోనే..!
మమ్మల్ని విచ్చలవిడిగా
తిరగనివ్వండి..!

ఐతే ఓ అందమా...నీవెక్కడ...?
చీరకట్టులోనా...? స్త్రీ గుట్టులోనా...?
ఆమె నుదుటి బొట్టులోనా...? కాదు...

మరి ఓ అందమా...నీవెక్కడ...?
ఆత్మవిశ్వాసంలో స్వాభిమానంలో
స్త్రీ జాతి స్వేచ్ఛా స్వాతంత్ర్యంలో
కొండంత నిండుదనంలో నేనక్కడ..!

ఓ మహిళామణులారా...
ఇకనైనా తెలుసుకోండి...
తిండి మీ కోసమని...
వస్త్రాలు పరుల కోసమని...
కామాంధులు పుట్టరని...
కొందరిచే సృష్టించబడతారని..!

ఇది ఒక సభ్య సమాజం..
మన సభ్యతే...మన శోభ
మన సంస్కారమే...మన శక్తి
మన సాంప్రదాయమే...మన గౌరవం..!

భరతమాత మెడలో
మెరిసే మణిహారాలే మీరు..
మీ స్వేచ్ఛే...మీకు అందం...
మీ ఆత్మగౌరవమే...మీకు శోభ...
మీ అలంకరణే...మీకు ఆభరణం..!

ఆ అర్థనగ్న వస్త్ర ధారణ
ఆ పాశ్చాత్య సంస్కృతి మనకేల..?
దేహాన్ని నిండుగా కప్పుకున్న వారే
దేవతామూర్తులు....సందేహమేల..?



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# ఇటు కల్యాణి, అటు కృతి.. కొత్త ఆశలు

కొత్త ఏడాదిలో ఇద్దరు ముద్దుగుమ్మలు కొత్త ఆశలు పెట్టుకున్నారు. అవే బాలీవుడ్ డ్రీమ్స్. అటు సూపర్ హిట్ తో ఊపుమీదున్న కల్యాణి ప్రియదర్శన్, ఇటు ఫ్లాపులతో ఇబ్బంది పడుతున్న కృతి శెట్టి.. ఈ ఏడాది బాలీవుడ్ లో అడుగుపెడుతున్నారు. కొత్త ప్రయత్నం సక్సెస్ అవ్వాలని కోటి దేవుళ్లకు మొక్కుతున్నారు.

కృతి శెట్టి సంగతి అందరికీ తెలిసిందే. 'ఉప్పెన'లా ఎగిసిపడి అంతే వేగంగా కిందపడింది ఆమె కెరీర్. బౌన్స్ బ్యాక్ అవుతుందనుకున్న ప్రతిసారి ఆమెకు ఫ్లాపు వచ్చింది. చివరికి కార్తితో చేసిన సినిమా కూడా ఆఖరి నిమిషంలో వాయిదా పడటంతో కృతి కెరీర్ అయోమయంలో పడింది.

ఇలాంటి టైమ్ లో ఆమె బాలీవుడ్ లో అడుగుపెడుతోంది. ఓవైపు తమిళ్ నుంచి అవకాశాలు వస్తున్నప్పటికీ, ఆమె బాలీవుడ్ సినిమాలపై ఆసక్తి చూపించింది. ఓ సినిమాకు సైన్ చేసిన విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించింది. టైగర్ ష్రాఫ్ సరసన ఆమె నటించనుంది.

ఇక మరో హీరోయిన్ కల్యాణి ప్రియదర్శన్ కూడా ఈ ఏడాది బాలీవుడ్ లో అడుగుపెడుతోంది. ఈ ముద్దుగుమ్మ ఏకంగా రణ్వీర్ సింగ్ సరసన ఛాన్స్ కొట్టేసింది. త్వరలోనే ఓ జాంబీ సినిమా చేయబోతున్నాడు ధురంధర్ హీరో. అందులో హీరోయిన్ గా కల్యాణి ప్రియదర్శన్ ను తీసుకున్నారు. ఇలా కల్యాణి, కృతి శెట్టి ఇద్దరూ ఒకేసారి బాలీవుడ్ లో అడుగుపెడుతున్నారు. ఇప్పటికే కీర్తిసురేష్ లాంటి హీరోయిన్లు చాలామంది బాలీవుడ్ లో అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ ఏడాది ఇంతమంది ఈ లిస్టులో చేరతారో చూడాలి.



# హీరోలు ప్రమోషన్‌కు దూరం

భారీ సినిమాలు చేసేయాలి. సంక్రాంతి బరిలోకి దింపేయాలి. సరే, రెమ్యూనిరేషన్లు ఎలాగూ భారీగానే వుంటాయి. అది వేరే సంగతి. కానీ సినిమా ప్రమోషన్లకు మాత్రం హీరోలు దూరం. ఒక్క హీరో కూడా ఒక్క మీడియా మీట్ పెట్టలేకపోతున్నారు. అదేంటీ అంటే, ఏవేవో అడుగుతారు అనే సాకు. అడిగితే సమాధానం చెప్పడానికి ఏమి అనేదానికి మాత్రం సమాధానం వుండదు. అదే బాలీవుడ్ మీడియానో, మరో భాష మీడియానో అడిగితే మాత్రం అన్ని పర్సనల్ విషయాలు సవివరంగా షేర్ చేసుకుంటారు. అది వారి ఇష్టం అనుకోండి.






సంక్రాంతికి వస్తున్న భారీ సినిమా రాజాసాబ్. కానీ హీరో ప్రభాస్ ఒక్కసారి కూడా మీడియా ముందుకు రాలేదు. ఓ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు మాత్రం వచ్చారు. సందీప్ వంగాతో ఇంటర్వ్యూ చేసారు. అంతే. ముందుకు రావడం లేదు. ప్రీ రిలీజ్ కు వస్తున్నారు. నిర్మాతలు మాత్రం ఓ మీడియా మీట్ నిర్వహించారు. మెగాస్టార్ సరదాగా నవ్వులు రువ్వించేందుకు చేస్తున్న సినిమా ఇది. వెంకటేష్ కూడా ఈ సినిమాలో వున్నారు. ఆయన కూడా మీడియా ముందుకు రావడం లేదు.

రవితేజ చేస్తున్న సినిమా భర్త మహాశయులకు.. ఇక్కడా అదే తీరు. మామూలుగానే రవితేజ మీడియా ముందుకు రారు. ఇంటర్వ్యూలు ఇవ్వరు. ఈ సినిమాకు కూడా అదే తీరు.

సినిమా నారీ నారీ నడుమ మురారీ. ఈ సినిమా ప్రమోషన్లకు మీడియా ముందుకు వచ్చే సూచనలు ఇప్పటి వరకు అయితే కనిపించడం లేదు. వస్తారో, రారో క్లారిటీ లేదు. నవీన్ పోలిశెట్టి మాత్రం వీరందరి కన్నా బెటరే. తన అనగనగా ఒక రాజు సినిమా కోసం ఇప్పటికే ఓ మీడియా ఈవెంట్ నిర్వహించారు. ఒకటి రెండు రోజుల్లో ఇంటర్వ్యూలు మొదలుపెడతారని సంకేతాలు కనిపిస్తున్నాయి.

# పలు ఆత్మీయ పరామర్శల్లో పాల్గొన్నా మాజీ స్పీకర్



**నవతరం-ఆమదాలవలస**

పొందూరు మండలం లో పలు ఆత్మీయ పరామర్శలలో పాల్గున్నా మాజీ స్పీకర్ పార్లమెంటరీ సమన్వయ కర్త తమ్మినేని సీతారాం గోరింట గ్రామంలో కూన నర్సింగ అచ్యుతరావు ఇటీవల గుండె సంభందించిన వ్యాధి కి శాస్త్ర చికిత్స చేయించు కున్నారు ఆయన్ని పరామర్శించారు అదే గ్రామంలోచౌదరి లక్షణరావు ఇటీవల గుండె సంబంధిత వ్యాధి తో మృతి చెందారు అదే విధంగా చింతాడ సరోజినమ్మ అగ్ని ప్రమాదంలో మృతి చెందారు కింతలి గ్రామానికి చెందిన పైడి వెంకట రామారావు ఇటీవల మృతి చెందారు అదే విధంగా జి. సిగడం మండలం పెంట గ్రామంలో అలుగోలు సురేష్ కుటుంబనికి మేనల్లుడు సింహాద్రి శరత్ చంద్ర తల్లి సీతరత్నం ఇద్దరు ఒకేసారి ఇటీవల మృతి చెందారు ఆ ఆ కుటుంబలను బుధవారం మాజీ స్పీకర్ పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం పరామర్శించారు మృతికి గల కారణాలు అడిగి తెలుకున్నారు.

ఆ కుటుంబాలకు ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాలంటీర్ విభాగం జాయింట్ సెక్రటరీ పైడి రాణా ప్రతాప్ మాజీ మండల అధ్యక్షులు పప్పల రమేష్ మాజీ ఏఎంసీ చైర్మన్ బాడన సునీల్ మండల బూత్ కమిటీ కన్వీనర్ బాడన వెంకట కృష్ణారావు పెనుబర్తి సర్పంచ్ తమ్మినేని మురళీకృష్ణ తాడివలస మాజీ సర్పంచ్ తమ్మినేని వాసు తుంగపేట మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి ప్రసాద్ కొంచాడ సర్పంచ్ అనురాధ వైఎస్ఆర్ పార్టీ నాయకులు కూన రాజారావు గోపాలం ఫకీరు గురుగుబెల్లి లక్ష్మణరావు తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండు దశాబ్దాల గృహకలహం సుఖాంతం

## డి ఎల్ ఎస్ ఏ చొరవతో ఒక్కటైన వీర జవాన్ కుటుంబం




**నవతరం -శ్రీకాకుళం**

మనస్పర్థలతో సుమారు 14 ఏళ్లుగా విడివిడిగా ఉంటున్న ఒక వీర జవాన్ కుటుంబాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు పెద్దల సమక్షంలో బుధవారం ఏకం చేశారు. కొత్తూరు మండలం ఆకులతంపర గ్రామానికి చెందిన గొద్దు సుజాతకు, ఎయిర్‌ఫోర్స్ మాజీ ఉద్యోగి, దివంగత కొయ్యాన నవీన్‌తో 2004లో వివాహమైంది. వీరికి నూతన్, గీతం అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, 2011లో వచ్చిన మనస్పర్థల కారణంగా సుజాత తన భర్తను విడిచి పుట్టింటికి వెళ్ళిపోగా, నవీన్ తన ఇద్దరు బిడ్డలను పెంచి పెద్దచేశారు. ఇటీవల యూనియన్ బ్యాంక్ ఉద్యోగిగా పనిచేస్తూ నవీన్ గుండెపోటుతో మరణించడంతో, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, సెక్రటరీ _. హరిబాబు ప్రత్యేక చొరవతో శ్రీకాకుళం బుచ్చిపేటలో ఉంటున్న పిల్లలను, తల్లి సుజాతను కలిపి రాజీ కుదిర్చారు.

ఈ రాజీ ఒడంబడిక ప్రకారం.. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి సుజాతకు కేర్ టేకర్ ద్వారా వైద్యం చేయించే బాధ్యతను పెద్ద కుమారుడు నూతన్ స్వీకరించారు.

అలాగే, తండ్రి మరణానంతరం వచ్చే పెన్షన్ తల్లికి, కారుణ్య నియామక ఉద్యోగం పెద్ద కుమారుడు నూతన్‌కు, ఇతర ఆర్థిక ప్రయోజనాలన్నీ చిన్న కుమారుడు గీతంకు చెందేలా ఇరుపక్షలు అంగీకారానికి వచ్చారు. అందరూ ఒకే ఇంట్లో కలిసి ఉండాలని నిర్ణయించుకోవడంతో సుదీర్ఘ కాలంగా నలుగుతున్న ఈ కుటుంబ సమస్య సుఖాంతమైంది. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు, న్యాయవాదులు పూర్ణచంద్రారావు, శైలజ, వి. జ్యోతిర్మయి, జి. ఇందిరా ప్రసాద్, జి. సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

# కోత చినబాబు మృతి పట్ల పలువురు సంతాపం

## నివాళులర్పించిన కృష్ణదాస్, తిలక్



**నవతరం టెక్కలి**

ఇటీవల టెక్కలి మండలం పెదసాన గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రైతు నాయకుడు కోత చినబాబు మృతి పట్ల వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాస్, టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ లతోపాటు వైఎస్ఆర్సిపి నాయకులు తమ సంతాపం వ్యక్తం చేసి కోత చినబాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోత చినబాబు కుమారులు మాజీ జడ్పిటిసి సభ్యులు కోత మురళీధర్ సోదరులను, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నందిగాం నరసన్నపేట ఎంపీపీలు నడుపూరు శ్రీరామమూర్తి,అరంగి మురళీధర్,కోటబొమ్మాళి జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, వైఎస్ఆర్సిపి నాయకులు ఎర్ర చక్రవర్తి, సత్తారు సత్యం, తమన్నా గారి కిరణ్, కిల్లి అజయ్ కుమార్, కుర్మాన బాలకృష్ణ, జడ్యాడ జయరాం, చిన్ని జోగారావు, పోలాకి మోహనరావు అంబోడి విష్ణు, సర్లాన బైరగి, హనుమంతు వెంకటేశ్వరరావు, పెద్ద సర్పంచ్ పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# ఏ ఐ ఎన్ పి ఎస్ ఈ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా.. మాచన రఘునందన్




పాత పింఛను పథకం పునరుద్ధరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని.. పాలకులు ఎవరైనా భాగస్వామ్య పింఛను పథకం రద్దు చేసి తీరాల్సిందేనని ఆలిండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్( ఏ ఐ ఎన్ పి ఎస్ ఈ ఎఫ్)జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్ స్పష్టం చేశారు.బుధవారం నాడు ఆయన హైదరాబాద్‌లో.. మాట్లాడుతూ..పాత పింఛను పథకం పునరుద్ధరణ,న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు విషయం లో అటు కేంద్రం,ఇటు రాష్ట్రాలు అనుసరిస్తున్న ధోరణి పై చర్చించేందుకు గాను వివిధ రాష్ట్రాల అధ్యక్షుల తో..బుధవారం ఉదయం జూమ్ సమావేశం జరిగిందని..ఈ సందర్భంగా దక్షణ భారత దేశం ప్రతినిధి గా.. తెలంగాణ నుంచి హాజరైన తనను ఏ ఐ ఎన్ పి ఎస్ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి గా నియమిస్తున్నట్టు..జాతీయ అధ్యక్షులు మంజీత్ సింగ్ స్పష్టం చేసినట్టు రఘునందన్ వివరించారు.దేశ వ్యాప్తంగా కోటి మంది కి పైగా ఉద్యోగులు కొత్త పెన్షన్ పథకం లో ఉన్నారని రఘునందన్ స్పష్టం చేశారు.2004 సెప్టెంబర్ 1 నుంచి ఉమ్మడి అంధ్ర ప్రదేశ్ లో భాగస్వామ్య పింఛను పథకం అమలు ప్రారంభం అయ్యిందని,ఉద్యోగం అంటేనే ఒక సామాజిక భద్రత కాగా.. సి పి ఎస్ లో ఉన్న ఉద్యోగి కి అర్థిక భద్రత తో పాటు సామాజిక భద్రత కూడా ఉండదని రఘునందన్ అవేదన వ్యక్తం చేశారు.ప్రమాదవశాత్తు ఎవరైనా సి పి ఎస్ ఉద్యోగి కి అవాంఛనీయ సంఘటన కు గురైతే కనీసం లక్ష రూపాయలు కూడా వారి ఖాతా లో ఉండవని, అటువంటపుడు పెన్షన్ రాని ప్రభుత్వ ఉద్యోగం కన్నా ప్రైవేటు ఉద్యోగమే మిన్న అన్న భావన ను కాంట్రి బ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారని రఘునందన్ అభిప్రాయపడ్డారు. ఈ నెల 11 న కొత్త ఢిల్లీ లో కార్యక్రమం ఉందని"మాచన" తెలిపారు.

# అస్సాం చీఫ్ సెక్రటరీ కోత రవికి స్వగ్రామంలో ఘన స్వాగతం

- చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి స్వగ్రామ పర్యటన
- కుటుంబసభ్యులు, గ్రామస్తులు, విద్యార్థుల ఆప్యాయతతో పండుగ వాతావరణం



**నవతరం, సంతబొమ్మాళి**

అస్సాం రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్టమొదటిసారిగా స్వగ్రామమైన కోటపాడు గ్రామానికి విచ్చేసిన ఐఏఎస్ అధికారి కోత రవి గారికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు, చిన్ననాటి స్నేహితులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కోత మధు, కోత ధర్మారావు, కోత సతీష్, పొందల రామకృష్ణ, అట్టాడ తిరుపతిరావు, మార్పు నాగభూషణ్, వాడ రేవు ప్రసాద్, అందవరపు నాగేశ్వరరావు, కోటపాడు బృందావనం యూత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నతమైన పదవిలో ఉన్నప్పటికీ గ్రామస్తులందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, మనభేదాలు లేకుండా కలుపుకునే కోత రవి గారి మనస్తత్వం అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఆయన రాకను గ్రామంలో పండుగలా జరుపుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.

# రైతుల వివరాలను సర్వే చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

**మండేసూర్యుడు న్యూస్, ఆమదాలవలస**

ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ లో ఎంపిక చేసిన గ్రామాల్లో రైతులు యొక్క వివరాలను సేకరించి ఉర్వి యాప్ లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యన్నారాయణ తెలిపారు.

ఈరోజు ఐ.సి.టి యన్.యఫ్.ఎ శివకృష్ణ డాటా సేకరణ లో భాగంగా ఆమదాలవలస మండలం లో టి.జొన్నవలస మరియు అక్కులపేట పేట గ్రామాలలో మరియు సరుబుజ్జిలి మండలం సింధువాడ, సలంత్రి గ్రామాల్లో సిబ్బందితో డేటా ఎంట్రీలో పాల్గొని వారికి డేటా ఎంట్రీ లో తగు సలహాలు సూచనలు ఇచ్చారు.ఖచ్చితమైన రైతులు యొక్క భూమి వివరాలను మరియు వ్యక్తిగత వివరాలను ఉర్వి యాప్ లో నమోదు చేసే ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిఎఫ్ స్ సురేష్



మరియు ఈశ్వర్ అలాగే యఫ్.యశీ.టి పుట్టా సురేష్ మరియు ట్రైనీ ఐ.సి.ఆర్పీస్ పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**